కలెక్టర్‌ను కలిసిన డిపిఆర్ఒ

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా పౌర సంబంధాల అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె బాల మాన్ సింగ్ బుధవారం జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా తన ఛాంబర్లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, అక్రిడిటేషన్ల వ్యవహారాలు, ఇతర అంశాల్లో అనుసరించాల్సిన విధానాలపై కలెక్టర్ డిపిఆర్ఒకు పలు సూచనలు చేశారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న డిపిఆర్ఒ

నిలిచిన పిఎం జన్‌మన్ గృహాలు

▶▶ లబ్ధిదారులకు అందని బిల్లులు ▶▶ హౌసింగ్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఆదివాసీ నిరుపేద పివిటీజీ కుటుంబాలకు తమ సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పీఎం జన్ మన్ పథకం 2023లో భారత ప్రభుత్వం ప్రారంభించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీ 11 మండల పరిధిలోని 28570మందికి పైగా ఆదిమ జాతి పివిటిజి జన్ మన్ లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు.

అరకులోయ మండలం 14 పంచాయితీ పరిధిలో 86 గ్రామాల్లో పీఎం జన్ మన్‌లో 2464 లబ్ధిదారులు ఉన్నారు. సుమారు బేస్మెంట్, లింటల్ లెవెల్, స్లాబ్ లెవెల్ బిల్లులు కలిపి 1989 మంది లబ్ధిదారులకు సుమారు 1.69 లక్షలు రావల్సిన బకాయి ఉంది. మిగతా 475 మంది లబ్ధిదారులకు మోడల్ కాలనీ వచ్చిందన పేరుతో బిల్లులు మంజూరు చేయకుండా నిలుపుదల చేశారు. ఇందులో పిరిబంధ, దోమల జోరు, రక్తకండి, పాలమని వలస గ్రామాల్లో హుదుద్ తుఫాన్ బాధితులకు నిర్మిస్తున్న మోడల్ కాలనీ నేటికీ పూర్తి చేసి గుత్తేదారుడు, ప్రభుత్వం అప్పగించలేదు. దీంతో హుదూద్ తుఫాన్ బాధితులు ఏమి చేయాలన్న సందిగ్ధంలో ఉన్న పరిస్థితి నెలకొంది. వీరికి ఒక్క రూపాయిలు కూడా పిఎం జన్ మన్ నిధులు మంజూరు కాలేదు. హుదుద్ తుఫాను బాధితులకు భవనం పూర్తి కాకపోవడం ఇటు జన్ మన్ ఇల్లు బిల్లులు జమ కాకపోవడంతో గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతి బిల్లుకు ముడుపులు అడుగు తుండడంతో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు తక్కువైతే దాంట్లో హౌసింగ్ అధికారులు ఇచ్చే ముడుపు నిరుపేద ఆదివాసి పివిటిజి కుటుంబాలు ఎలా ఇల్లు నిర్మాణాలు చేసుకుంటామని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న మూడు లక్షల ముప్పై తొమ్మిది వేలు చాలదని 10 లక్షలు పెంచాలని కోరుతుంటే హౌసింగ్ అధికారులు ప్రతి బిల్లుకు ముడుపులు ఇస్తే తప్ప బిల్లులు చేయమని చెపుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

జన్ మన్ పథకం కింద ఇళ్లు, తాగనీరు, రోడ్డు, విద్యుత్, విద్య, వైద్యం వివిధ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రధాన మంత్రి జన్ మన్ పథకం ప్రారంభించింది. కానీ కేంద్ర ప్రభుత్వం బిల్లులు నిలుపుదల చేయడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యంత మారుమూల ప్రాంతంలో నివసిస్తున్న వేలాది మంది పివిటిజి తెగలకు కనీస వసతులు అందని ద్రాక్షగా మారింది. నేటికీ పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజన గ్రామాల్లో కనీస రోడ్డు సౌకర్యం,వైద్యం కోసం లేక డోలిమోతలే దిక్కు. తక్షణమే తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి జన్ మన్ లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మధ్యలో నిలిచిన గృహ నిర్మాణం

లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలి

ఆదివాసి విటిజి తెగలకు పిఎం జన్ మన్ పథకం లబ్ధిదారులకు రావలసిన బకాయిలు విడుదల చేసి ఇల్లు నిర్మాణాలకు ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలి. అల్లూరి జిల్లా ఏజెన్సీ 11 మండలాల పరిసరాల ప్రాంతంలో నూటికి 98శాతం మంది అటవీ వ్యవసాయ ఉత్పత్తులపై ఆధారపడి నిరుపేద ఆదివాసి గిరిజనులు జీవిస్తున్నారు. వీరికి ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోతే ఇల్లు నిర్మాణాలు ఎలా చేస్తారు.పీఎం జన్ మన్ గృహాలు మంజూరైన ప్రతి కుటుం బాలకు ఇల్లు నిర్మాణానికి 10లక్షలకు నిధులు పెంచాలి

పొద్దు బాలదేవ్
ఆదివాసి గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి.
అల్లూరి సీతారామరాజు జిల్లా

పివిటిజిలను ఆదుకోవాలి

త్వరితగతిన పీఎం జన్ మన్ బిల్లులు చెల్లించి నిరుపేద పివిటీజీ కుటుంబాలకు ఆదుకోవాలి.బిల్లులు నిలుపుదల చేయడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. బిల్లులు చెల్లించక పోవడంతో గృహాలను కట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆదివాసీలు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే నిధులు విడుదల చేసి ఇల్లు నిర్మాణానికి పూర్తి స్థాయిలో సహాయ సహకారం అందించే విధంగా చర్యలు తీసుకోలి.

బురిడి భాస్కరరావు
సంఘంవలస గ్రామం.
సుంకరమెట్ట పంచాయతీ
అరకులోయ మండలం

మాట్లాడుతున్న యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కన్నారావు

ఎంఇఒ-1 లక్ష్మినారాయణను సస్పెండ్ చేయాలి

యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి- కూనవరం / విఆర్‌పురం: మండల విద్యావనరుల కేంద్రంలో కూనవరం యుటిఎఫ్ మండల కమిటి ఆధ్వర్యంలో బుధవారం అత్యవసర మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కన్నారావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం టీచర్స్ ట్రాన్స్ఫర్ రేగ్యులేషన్ యాక్ట్ -2025 ప్రకారం చట్టబద్ధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం కాకినాడలో జరిగిన మాన్యువల్ కౌన్సిలింగ్‌లో ఎవ్వరైతే బదిలీలు కోరుకున్నారో వారికి బదిలీలకు సంబంధించి షెడ్యూల్ ఇచ్చారు. జూన్ 11న సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులకు కాకినాడ డిఇఒ కార్యాలయంలో మాన్యువల్ కౌన్సిలింగ్‌కు హాజరైతే ఉపాధ్యాయులు కోరుకున్న పోస్టలన్నీ రద్దయ్యాయని దీనంతటికి ఇన్‌చార్జి ఎంఇఒ 1 లక్ష్మీనారాయణ కారణం అని పేర్కొన్నారు. ఆయన సమర్పించిన తప్పుడు క్యాడర్ స్ట్రెథ్ దీనికి కారణమన్నారు. ఉపాధ్యాయులను మానసికంగా భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బందులు సృష్టించిన లక్ష్మినారాయణను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు. సమావేశంలో మండల అధ్యక్షులు ఎ.నాగేశ్వరావు, యం.రాంబాబు, పి.రాజారావు, కె.మహేష్ పాల్గొన్నారు.

ఇంకా.. తెరుచుకోని పాఠశాలలు!

▶▶ విద్యకు దూరం అవుతున్న విద్యార్థులు ▶▶ తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలి : తల్లిదండ్రులు

మూతపడిన పనసవలస పాఠశాల

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో గిరిజనులకు నాణ్యమైన విద్యను అందిస్తానంటున్న ప్రభుత్వం సకాలంలో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యే పరిస్థితి ఉంది. పాఠశాలలు రీ ఓపెన్ అయి రెండు వారాలు దాటినా సొవ్వ పంచాయితీ పనసవలస గ్రామంలో మాత్రం టీచర్ లేరు. స్కూల్ టీచర్ రానందున దాదాపు 32 మంది విద్యార్థులు పూర్తిగా విద్యకు దూరమయ్యే పరిస్థితి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. రీఓపెన్ కు ఒకటి రెండు రోజులు స్కూల్ ఉపాధ్యాయుడు వచ్చి వెళ్లారని, బదిలీ అవుతానని చెప్పారని తల్లిదండ్రులు తెలిపారు. కానీ ఆ ఉపాధ్యాయుడు ఇంకా బదిలీ అవ్వకపోయినా ఇప్పటికి రాలేదని గ్రామస్తులంటున్నారు, వేరే ఉపాధ్యాయుడు కూడా రాలేదని తెలిపారు. బదిలీ అయ్యిందో లేదో కానీ ఈ రెండు వారాలు స్కూల్ కి టీచర్ రాక పోవడంతో తమ పిల్లలు విద్యకు దూరం అవుతున్నారని తల్లిదండ్రులు వాపోయారు.ఇలా అయితే తమ పిల్లలు పూర్తిగా విద్యకు దూరమైపోయే పరిస్థితి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ అధికారులు దృష్టి పెట్టి తమ గ్రామానికి స్కూల్ టీచర్‌ను పాతవారిని కొనసాగించాలని, లేకుంటే కొత్త వారిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

ఆందోళన చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులు,

ముంచింగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కర్లపొదొర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునికి తక్షణమే నియమించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్య వర్గ సభ్యుడు, లక్ష్మీపురం గ్రామపంచాయతీ సర్పంచ్ కొర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు తెలుపుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా త్రినాధ్ మాట్లాడుతూ, కర్ల పోదోర్ పాఠశాలలో సుమారు 26 మంది పివిటిజి విద్యార్థులు ఈ విద్యా సవత్సరంలో విద్య అభ్యస్తున్నారని, గతం లో విధులు నిర్వహించిన ఉపాద్యాయుడు బదిలీ అయ్యారన్నారు. వేరే ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు పున్ణ ప్రారంభమై నేటికీ 13 రోజులు పూర్తి అవుతున్నా ఉపాధ్యాయుడిని నియామకం చేయక పోవడంతో పాఠశాల మూతబడిందన్నారు. దీంతో ఆదివాసి గిరిజన విద్యార్థులు విద్యాభ్యాసానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ , ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. అర్ధాంతంగా నిలుపుదల చేసిన నాడు నేడు పాఠశాల భవనలు పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వి.నీలకంఠం, కె.గోపాల్, కామరాజు, శ్రీను, రాజు, లైకోన్, రాంబాబు, కోమటి, కృష్ణ, రాజేంద్ర పాల్గొన్నారు.

స్ప్రేయింగ్ ప్రారంభిస్తున్న పిఒ కట్టా సింహాచలం

డ్రోన్లతో దోమల మందు పిచికారి

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో మలేరియా నిర్మూలన కోసం మలేరియా నివారణ మందు స్ప్రేయింగ్ డ్రోన్ ద్వారా నిర్వహిస్తున్నామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం రంపచోడవరం సాయినగర్‌లో మలేరియా నివారణ మందు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఏజెన్సీలో డ్రోన్ ద్వారా మురుగునీటి కుంటల్లో స్ప్రేయింగ్ చేయిస్తున్నామన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా రంపచోడవరం చెరువూరు గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయిస్తున్నామన్నారు. జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ, అడిషనల్ డిఎంహెచ్ఓ శిరీష, డిఎల్‌డిఒ కోటేశ్వరరావు, ఎంపిడిఒ పి.జయంతి, సర్పంచ్ మంగ బొజ్జయ్య, ఎఎంఒ శ్రీనివాసరాజు, మలేరియా కో ఆర్డినేటర్ చంటిబాబు, పంచాయతీ కార్యదర్శులు, రమేష్, సుధాప్రకాష్, సబ్ యూనిట్ అధికారులు, ఎంపిహెచ్‌ఎలు తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం, మోతుగూడెం పరిధిలోని దబ్బాగూడెంలో డ్రోన్ల ద్వారా మలేరియా నివారణ మందు స్ప్రే చేశారు. ఐటిడిఎ పిఒ అపూర్వభరత్ నేతత్వంలో నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పుల్లయ్య, జిల్లా మలేరియా అధికారి జ్ఞాన శ్రీ స్థానిక వైద్యాధికారి ప్రగ్న వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రంపచోడవరం : మెయింటేనెన్స్ పనుల్లో భాగంగా శుక్రవారం 11 కెవి. రంపచోడవరం ఫీడర్, 11కెవి పోక్స్ పేట ఫీడర్‌లో లైన్లకు దగ్గరగా ఉన్న చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా రంపచోడవరం, సిరిగిందలపాడు, తామరపల్లి, ఊట్ల, నరసాపురం పోక్స్‌పేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గాబ్రియేల్ తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్

వ్యవసాయానుబంధ రంగాల రుణ పరపతి పెంచండి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: వ్యవసాయానుబంధ రంగాలకు రుణ పరపతి పెంచాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. రైతులు, చిరువ్యాపారులు, స్వయం సహాయక సంఘాలకు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు బ్యాంకులు రుణాలు అందించి ప్రోత్సహిం చాలన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నాలుగవ త్రైమాసిక జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ, మత్స్యశాఖ, డిఆర్‌డిఎ గత ఏడాది రుణ ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.1364 కోట్ల వార్షిక రుణ ప్రణాళికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంత్సరంలో రూ.975.72 కోట్ల రుణ లక్ష్యంగా నిర్దేశించగా రూ.1145.67 కోట్ల రుణాలను అందించి లక్ష్యాలకు మించి రుణాలు అందించారన్నారు. రైతులకు, మహిళా సంఘాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో సచివాలయాల వారిగా ఉన్న రైతులను గుర్తించి జాబితా సిద్ధం చేయాలని సూచించారు. రుణ ప్రణాళిక లక్ష్యాలను సాధించి అదేవిధంగా అధికారులు రికవరీ పై దృష్టి పెట్టాలన్నారు.గ్రామాలలో సభలు నిర్వహించి రైతులు రుణాలు తిరిగి చెల్లించే విధంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గత ఖరీఫ్ కాలంలో రూ.254 కోట్లు లక్ష్యంగా నిర్దేశించగా 27,321 మంది రైతులకు రూ.256 కోట్లు స్వల్పకాలిక రుణాలు అందించి 100.81 శాతం సాధించారన్నారు. రబీలో 17,043 మంది రైతులకు రూ.169 కోట్లు రుణ లక్ష్యం నిర్దేశించగా రూ.176.96 కోట్ల రుణాలను అందించి 104.71 శాతం రుణ లక్ష్యాలు సాధించారని చెప్పారు. ఈ ఏడాది అదనంగా 500 మంది రైతులను గుర్తించి వ్యవసాయ రుణాలు అందించాలని సూచించారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కింద పశువులు, పందులు, గొర్రెలు, మేకలు, కోళ్లు పెంపకందారులకు 50 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. మత్స్యకారులకు రుణాలు అందించి చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. పట్టు సాగు చేస్తున్న రైతులకు షెడ్డు నిర్మాణానికి రూ.1 లక్ష రుణం అందించాలని చెప్పారు. 2024 25 ఆర్థిక సంవత్సరంలో 8735 స్వయం సహాయక సంఘాలకు రూ.483.23 కోట్ల బ్యాంకు లింకేజి అందించారన్నారు.

2025-26 ఆర్థిక సంవత్సరంలో రైతులకు, వ్యాపారులకు మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేసి రుణ లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్, యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ జితేంద్ర శర్మ, ఆర్.బి.ఐ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ నవీన్, ఎల్ ఎం మాతు నాయుడు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, యూనియన్ బ్యాంకు మేనేజర్ పి.నారాయణరావు, డిఆర్డిఏ పి.డి. వి.మురళి, నాబార్డు డిడి ఎం వి.గౌరీ శంకర్ పాల్గొన్నారు.

బడులిలా..బలపం పట్టేదెలా..?

- రంపచోడవరం మండలం బర్నగూడెంలో పాకలోనే చదువులు
- నియోజకవర్గం మొత్తం భవనాలు లేనివి, మరమ్మతులకు గురైనవి 126 పాఠశాలలు

పాకలో నిర్వహిస్తున్న బర్నగూడెం ప్రాథమిక పాఠశాల

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం మండలం బర్నగూడెం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ సుమారు 18 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వారిలో ఒక ప్రధానోపాధ్యాయుడు రోళ్ళపల్లి నెహ్రూజి, ఉపాధ్యాయని చల్లారత్నం పనిచేస్తున్నారు. పాఠశాల భవనం సుమారు ఐదు సంవత్సరాల క్రితమే శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పాఠశాల నిధులనుండి కొంత నగదుతో తాత్కాలికంగా పాఠశాల ఆవరణలోనే పాక నిర్మించి తరగతులు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఎం నెహ్రూజీ మాట్లాడుతూ తాను ఈ పాఠశాలకు వచ్చినప్పటి నుంచి పాఠశాల భవనం శిథిలావస్థలోనే ఉందని దీనిని పునర్నిర్మించాలని కోరుతూ రంపచోడవరం ఐటిడిఎ పిఒకు,గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యేకు వినతి పత్రాలు ఇచ్చినా వారు చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు నేడు తమ పాఠశాలలను ఎంపిక చేసి నిధులు కేటాయించాలని కోరగా పాఠశాలలో కనీసం 25 మంది విద్యార్థులు ఉంటేనే అర్హత వస్తుందన్నారని, తమ పాఠశాలలో 18 మందే విద్యార్థులు ఉండటంతో నాడు నేడుకు ఎంపిక కాలేదన్నారు.

20 మార్లు వినతులు ఇచ్చాం

ఇప్పటివరకు సుమారు 20 సార్లు ఐటిడిఎ గ్రీవెన్స్‌లో, ప్రజాప్రతినిధులకు పలుమార్లు అర్జీలను ఇచ్చాను. సమస్యను పరిష్కారం కాలేదు.

- పల్లాల అరుణ,
విద్యా కమిటీ చైర్మన్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

ఇటువంటి పాఠశాలలు మండలంలో సుమారు 12 వరకు ఉన్నాయి. అసలు పాఠశాల భవనాలు లేనివి, మరమ్మత్తు దశలో ఉన్నవి, పూర్తిగా శిథిలమైనవి నియోజకవర్గంలో మొత్తం 126 ఉన్నాయి. నిధులు కేటాయించాలని సర్వశిక్ష అభియాన్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఫలితం లేకపోయింది.

-మల్లేశ్వరరావు, ఎంఇఒ

రక్షణగోడ లేక అవస్థలు

సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం చప్పర్ల ఆశ్రమ పాఠశాలలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఈ పాఠశాలలో మూడు నుంచి 10వ తరగతి వరకు 194 మంది విద్యార్థులు చదువుతున్నారు. అరకొరకగా వసతిభవనాలు ఉండడంతో ఇబ్బందులు గురవుతున్నారు. పగటి సమయంలో తరగతి గదులనే రాత్రి వసతి గదులుగా కూడా వినియోగిస్తున్నారు. సమస్యలపై పలుమార్లు పాడేరు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, అప్పటి ఐటిడిఎ పిఒ అభిషేక్ ఆశ్రమ పాఠశాలను పలుమార్లు సందర్శించారు. పాఠశాలలో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకూ ఎటువంటి నూతన భవనాలు, వంటషెడ్లు నిర్మించలేదు. ఓవర్‌హెడ్ ట్యాంకులో నీటిని నింపి తద్వారా విద్యార్థులకు వంటకు, తాగునీటికి వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు నేడు పనుల్లో భాగంగా మినరల్ వాటర్‌ప్లాంట్ పాఠశాలకు మంజూరైంది. అయితే ఇప్పటివరకూ దానిని ఇన్‌స్టాల్ చేయకపోవడంతో నిరుపయోగంగా పడిఉంది. దట్టమైన అటవీ ప్రాంతం వద్ద ఆశ్రమం పాఠశాల ఉంది. పాఠశాలకు పూర్తిస్థాయి రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి సమయంలో గొర్రె గేదెలు, అడవి పందులు ఇతర జంతువులు పాఠశాల ఆవరణలో ప్రతిరోజూ సంచరిస్తున్నాయి. ఏ క్షణంలో అడవి జంతువులు దాడి చేస్తాయోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సిమెంట్ రేకులతో చిన్నపాటి వంటషెడ్డు ఏర్పాటు చేశారు. భారీగా వర్షం కురిస్తే వంటషెడ్‌లో నీరు చేరుతోంది. అధికారులు, స్పందించి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

రక్షణగోడ లేని చప్పర్ల ఆశ్రమ పాఠశాల

ప్రముఖ వైద్యులు దుద్దుకూరి వెంకయ్య మృతి

ప్రజాశక్తి- కూనవరం : మండలంలో ప్రముఖ వైద్యుల్లో ఒకరైన డాక్టర్ దుద్దుకూరి వెంకయ్య అనారోగ్యంతో భద్రాచలంలో ప్రైవేట్ ఆసుపత్రిలో బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గత 50 సంవత్సరాల నుండి కూనవర మండలమే కాక సమీప వి.ఆర్‌పురం, వేలేరుపాడు చింతూరు మండల ప్రజలకు ఉత్తమ వైద్యసేవలందించారు. ఆయా గ్రామస్తులు వారి సేవలను గుర్తు చేసుకుంటున్నారు. వారి కుటుంబానికి పలువురు సంతాపం తెలియజేసారు.



డాక్టర్ వెంకయ్య

కొయ్యూరులో కురుస్తున్న వర్షం

ఏజెన్సీలో వర్షం

ప్రజాశక్తి - కొయ్యూరు: మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామంలో కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైతులు ఇబ్బంది పడుతూ విత్తనాలు తీసుకున్నారు.

'ఉపాధి' బిల్లు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు మండలం మోదాపల్లి పంచాయితీ వంట చింత గ్రామంలో ఏప్రిల్ నెల నుండి జూన్ రెండో వారం వరకు చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించి తక్షణమే చెల్లింపులు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ పాలికి లక్కు డిమాండ్ చేశారు. బుధవారం ఈ గ్రామంలో పర్యటించిన సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ గ్రామంలోని ఉపాధి హామీ పనులకు సంబంధించి గిరిజనులకు నేటి వరకు ఉపాధి కూలీ డబ్బులు చెల్లించ లేదన్నారు. చాలామంది కూలీలు కూడా తమ సొంత పనులు వదులుకొని ఉపాధి పనులు చేసి ఉన్నారన్నారు. రోజువారి కూలీ చేస్తూ బతుకుతున్న ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రతి వారం పేమెంట్లు తక్షణమే చెల్లించాలని కోరారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం ప్రతి 14 రోజులకి చెల్లింపు జరగాలని, కానీ ఉపాధి పనులు చేసి 45 రోజులు కావస్తున్నా పేమెంట్ జరగకపోవడంతో ఉపాధి లబ్ధిదారులు ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తక్షణమే రావాల్సిన ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

3 నుంచి సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి-జికెవీధి: గూడెం కొత్త వీధి మండలంకు సంబంధించిన 8 మంది మహిళా సర్పంచులకు నర్సీపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జూలై 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. సర్పంచులందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వ్యాసరచన రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చింతపల్లి:మాదకద్రవ్యాల వాడకాన్ని నిరోధించేందుకు అవగాహన కల్పించే కార్యక్రమాలలో భాగంగా చింతపల్లి మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ మాదకద్రవ్య నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో గంజాయి సాగు, అక్రమ రవాణా, డ్రగ్స్ వినియోగం అనర్థాలపై పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాగిన రామారావు పడాల్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనుము కృష్ణ, కిల్లంగి ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో వికలాంగులకు ప్రవేశాలు

ప్రజాశక్తి-మధురవాడ : బక్కన్నపాలెంలోని ఏపి విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ, శిక్షణ, ఉత్పత్తి కేంద్రం, ఐటిఐలో 2025-26 విద్యా సంవత్సరానికి వికలాంగ పురుష అభ్యర్థులకు ప్రవేశాలకు ఈ నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారిణి కె.కవిత బుధవారం తెలిపారు. కార్పెంటర్ ట్రేడులో 24, షీట్ మెటల్ వర్కర్ 20, వెల్డర్ ట్రేడులో 20 మొత్తం 64 సీట్లు ఉన్నాయన్నారు. అర్హులైన వారికి ఏడాది పాటు ఉచితంగా శిక్షణ, భోజనం, వసతి సౌకర్యాలు, ఏక రూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు కల్పిస్తామన్నారు. ఈ సెంటర్‌లో రాష్ట్రంలోని 26 జిల్లాల వికలాంగ యువత ప్రవేశం పొందవచ్చునన్నారు. వచ్చేనెల 15వరకు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరా లకు ప్రాజెక్టు అధికారిణి కె.కవిత (90000 13610), ప్రిన్సిపాల్ సిహెచ్ భాస్కరరావు (73964 24319), రాజబాబు (95021 23060) లను సంప్రదించాలని సూచించారు.

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

• జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు-జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని, వాక్ థాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ సూచించారు. గంజాయి సాగును జీరో స్థాయికి తీసుకు వెళ్ళడమే అందరి లక్ష్యం కావాలని స్పష్టం చేసారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తో కలసి అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కార్యక్రమం ఏర్పాట్లు పై పోలీస్, వ్యవసాయ, అటవీ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య, విద్యా, ఐసిడిఎస్, డ్వామా, డి.ఆర్.డి.ఏ శాఖల అధికారులతో ఈనెల 26 న గురువారం గుంటూరులో ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించనున్నందున, ఇందులో భాగంగా పాడేరులో సమావేశం నిర్వహించారు. చింతూరు, పాడేరు, రంపచోడవరం ఐ టి డి ఎ పరిధిలో చేపట్టనున్న కార్యక్రమం నిర్వహణపై సంబంధిత ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. అన్ని శాఖలు సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఎస్.ఎచ్.జి సభ్యులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం మే కాకుండా వీధి నాటికలు ద్వారా అవగాహనా కల్పించాలన్నారు. జిల్లా అధికారులు కింద స్థాయి సిబ్బందితో సమావేశాలు చేపట్టి గంజాయి అనర్థాలపై ప్రచారం, అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ షేక్ సహబాద్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యాలను అధిగమించాలి

ప్రజాశక్తి-పాడేరు : స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన బ్యాంకు లింకేజీ లక్ష్యాలను అధిగ మించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి ఐటిడిఏ పిఓలు, వెలుగు, ఎల్‌డిఎం విద్యాశాఖ, గిరిజన సంక్షేమం, ఎస్ఎంఐ, ఐసిడిఏస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలను రీ వెరిఫి కేషన్ చేయాలన్నారు. గ్రామాలలో బ్యాంకు ఖాతాలు లేని వారికి బ్యాంకు ఖాతాలను ప్రారంభించాలని చెప్పారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాలలో చేర్పించాలని చెప్పారు. పి ఎం ఎస్ బి వై పథకంలో ఏడాదికి రూ. 20 లు చెల్లిస్తే రూ.2 లక్షలు, పి ఎం జెబి వై పథకంలో రూ. ఏడాదికి రూ.436 లు చెల్లిస్తే సహజ మరణానికి రూ. 2 లక్షలు భీమా పరిహారం చెల్లిస్తారని చెప్పారు. ప్రైమరీ పాఠశాలలను ఎక్కడా మూయలేదన్నారు. బడి ఈడు పిల్లలందరిని పాఠశాలలో చేర్పించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అంగన్వాడీల నుండి పాఠశాలలో చేరవలసిన విద్యార్థులు 12,150 మంది ఉన్నారని చెప్పారు. జూన్ 29 లోపు విద్యార్థులను పాఠశాలలో నమోదు చేస్తే తల్లికి వందనం వస్తుందన్నారు. విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. కొత్త యూనిఫాంతో పాఠశాలలకు హాజరు కావాలని చెప్పారు. జి పి ఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. విద్యార్థుల కాస్మోటిక్స్ జిసిసి నుండి సరఫరా చేస్తారని అన్నారు. పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎటిడబ్ల్యూ ఓలు రోజుకి రెండు ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. ఆశ్రమాలను పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఉండేలా తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జూలై 1వ తేదీన విద్యార్థులకు బేస్ లైన్ ఎగ్జామ్ నిర్వహించాలన్నారు. అంగన్వాడీ పిల్లలకు ఎఫ్ ఆర్ ఎస్ నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాడేరు ఐటిడిఏ పిఓ ఎం.జె. అభిషేక్ గౌడ, రంపచోడవరం పిఓ కె.సింహాచలం, (వర్చువల్) డి ఆర్‌డిఏ పిడి వి.మురళి, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్.రజని, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ఎపి సి స్వామినాయుడు, ఎల్‌డిఎం నాయుడు, గురుకులం ప్రిన్సిపాల్ పి ఎన్ ఎన్ మూర్తి, ఎస్ఎంఐడి. ఇ .నాగేశ్వరరావు, 22 మండలాల ఎంపిడిఓలు, సిడిపిఓలు పాల్గొన్నారు.

పాఠశాలలో చెట్ల తొలగింపుపై ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుగుడ:మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్య కమిటీ సభ్యుల తీర్మానం లేకుండా చెట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యా కమిటి చైర్మన్ టి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ కె.అప్పాలనాయుడు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోవాలని బుధవారం పాఠశాలలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొన్ని దశాబ్దాలుగా ఉన్న నీలగిరి, సిల్వర్ ఓక్ చెట్లు అక్రమంగా తొలగించడం తగదన్నారు. విద్యా కమిటి తీర్మాణం లేకుండా .గ్రామసభ ఏర్పాటు చేయకుండా .ప్రభుత్వ అనుమతులు ఉన్నాయన్ని ఏకపక్షంగా చెట్లు తొలగించడం చాలా దారుణమన్నారు. చెట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని, తొలగించిన చెట్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు కొర్ర. గౌరమ్మ, కిల్లో సుశీల, కొల్లో మొత్తి, మజ్జి ఝూన్సీరాణి, కొర్ర పరశురాం, బురిడీ మోహన్‌రావు, వంతల సద్దు, కిల్లో బుద్దు సభ్యులు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న విద్యా కమిటీ సభ్యులు

రంగురాళ్ల తవ్వకాలు చేపడితే చర్యలు

• చింతపల్లి అటవీశాఖ రేంజ్ అధికారి అప్పారావు

క్వారీని పరిశీలిస్తున్న ఫారెస్ట్ రేంజర్ అప్పారావు

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని సత్యవరం-గురుగూడెం గ్రామాల అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని కొంతమంది రంగురాళ్ల వ్యాపారులు, స్థానిక గ్రామస్తులను ప్రోత్సహించి అక్రమ తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందని చింతపల్లి అటవీశాఖ రేంజ్ అధికారి బొజ్జ అప్పారావు తెలిపారు. ఈ నేపథ్యంలో చింతపల్లి డివిజన్ అటవీశాఖ అధికారి వై.వి. నర్సింగరావు ఆదేశాల మేరకు రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు, లోతైన గోతులను గుర్తించి వాటిని మూసివేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలు అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ చట్టం ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని, వన్యప్రాణులను వేటాడితే వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధిస్తామని స్పష్టం చేశారు. అక్రమ తవ్వకాలను నియంత్రించేందుకు అటవీశాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ భూషణం, అటవీశాఖ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ఇవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా బుధవారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి. అనంతరం పర్యవేక్షణ రిజిష్టరులో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒకె.పద్మలత, తహసీల్దార్ త్రినాద్ నాయుడు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి- పాడేరు : జిల్లాలో పాఠశాలలు పున: ప్రారంభమైన నేపథ్యంలో బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. 6 నుండి 14 ఏళ్ల వయసు బాలలంతా నిర్బంధ ఉచిత పాఠశాల విద్య అభ్యసించాలన్నారు.ఈ నెల 12వ తేది నుండి జూలై 13వ తేది వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్రోల్మెంట్ డ్రైవ్ విధివిధానాలపై ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. బడిఈడు పిల్లలను ఎక్కడైనా పనిలో ఉంచితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బాల్యాన్ని హరించే హక్కు తల్లిదండ్రులకు కూడా లేదని బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, అధికారుల పైన ఉందన్నారు. ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతానికి అందరూ కృషి చేయాలన్నారు. బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్చి బడిబయట పిల్లలు లేని గ్రామంగా ప్రకటించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారి స్వామినాయుడు పాల్గొన్నారు

నేత్రపర్వంగా సింహాద్రి అప్పన్న గరుడసేవ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహలక్ష్మీ నసింహ స్వామి గరుడ సేవ బుధవారం నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని మండపంలో అధిష్టింపజేసి, పాంచరాత్ర ఆగమశాస్త్రం విధానంలో వేడుకను కమనీయంగా జరిపించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామి ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా అన్నదానం

ప్రత్యేక పూజలు చేస్తున్న కంబాల శ్రీనివాస్

ప్రజాశక్తి- రంపచోడవరం : రంపచోడవరంలోని నాగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఆయన రూ.10వేలు నగదు, 160 కిలోల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగమ్మతల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రామసేనసభ్యులు, బిజెపి నాయకులు దాసరి ధర్మ రాజు, బత్తుల నానాజీ, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుల్లో మధ్యవర్తులకు డబ్బిచ్చి మోసపోవద్దు

ప్రజాశక్తి - రంపచోడవరం : జిల్లాలో ప్రతి మండలంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలు ఎట్టి పరిస్థితుల్లో ఆగనివ్వమని ఆదివాసి సంక్షేమ పరిషత్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు స్పష్టం చేశారు. కొన్ని మండలాల్లో ఆక్రమణదారులు తమ అక్రమ నిర్మాణాలను ముప్పై అడుగుల మేర స్వచ్ఛందంగా తొలగించుకున్నారని అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కచ్చితంగా కొలతల ఆధారంగా కూల్చివేతలు జరుగుతాయని కొందరు కొలతల్లో మినహాయింపు ఇస్తామని చెప్పి డబ్బు వసూలు చేస్తున్నారని ఎవరికీ డబ్బు ఇచ్చి మోసపోవద్దని ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే తొలగింపులు ఉంటాయని ఎవరూ దీనికి అతీతులు కాదని ఆయన స్పష్టం చేశారు.

25 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - దేవీపట్నం: మండలం ఎస్.రామన్నపాలెం పరిసర ప్రాంతాల్లో నాటుసారా స్థావరం ఉన్నట్టు సమాచారం తెలుసుకుని దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తన సిబ్బందితో బుధవారం దాడి చేశారు. 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని రెండు వందల లీటర్ల పులిసిన బెల్లపుఊట ధ్వంసం చేశారు. ఒక వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నాటుసారా విక్రయించినా, తరలించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పగుళ్లు ఏర్పడిన శబరినదిపై నిర్మించిన బ్రిడ్జి

శిథిలావస్థలో శబరి బ్రిడ్జి

ప్రజాశక్తి - చింతూరు: శబరినదిపై నిర్మించిన వారధి ఇటీవల భారీ వాహనాల తాకిడికి గురై బీటలు పడుతోంది. 1975లో నిర్మించిన శబరి బ్రిడ్జిపై అప్పట్లో కేవలనం 10 నుండి 15 వాహనాలు మాత్రమే తిరిగేవి. ప్రస్తుతం వాహనాల తాకిడి ఎక్కువవడమే కాకుండా అధిక బరువున్న వాహనాలు, 30 నుంచి 40 టన్నుల బరువు గల గ్రానైట్ రాళ్లలోడుతో ఉన్న వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుండడంతో బ్రిడ్జి బీటలు వారి ప్రమాద స్థాయికి చేరుకుంది. ఈ బ్రిడ్జి కూలిపోతే చత్తీస్‌గడ్, ఆంధ్రా, ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాలకు రవాణా సౌకర్యం పూర్తిగా స్తంభించిపోతుంది. విశాఖ జిల్లా సీలేరు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి కాకినాడ, చత్తీస్‌గడ్‌లోని రాయపూర్, జగదల్పూర్ ఒడిస్సా రాష్ట్రంలోని మల్కనగిరి, కోరాపుట్ వంటి ప్రధాన పట్టణాలకు రాకపోకలు సాగించేందుకు ఈ బ్రిడ్జి ఉపయోగకరంగా ఉంది. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి బ్రిడ్జి బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

ప్రజాశక్తి - అడ్డతీగల: మండలంలో వివిధ పాఠశాలలను, కళాశాలలను బుధవారం ఎమ్మెల్సీ గోపిమూర్తి సందర్శించారు. ఎల్లవరం, కొట్టంపాలెం, అనంత అడ్డతీగల, రాయిపల్లిలో పాఠశాలలను, కళాశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అదేవిధంగా ఉపాధ్యాయుల సమస్యలను కూడా తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో వాచ్‌మెన్, నర్సులు, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఉపాధ్యాయులు ఫేసియల్ అటెండెన్స్ విషయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని సిగ్నల్స్ లేక సగం సమ యం అక్కడే అయిపోతోందని ప్రభుత్వానికి సూచించామన్నారు. యాప్‌ల వల్ల పనిభారం పెరిగిపోతోందన్నారు. మండలంలో చాలా సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నాయని ఆయా పాఠశాలల్లో ఖాళీలను డిఎస్‌సి ద్వారా గాని సిఆర్‌టిల ద్వారా గాని భర్తీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి రాఘవులు, ఎఫ్‌డబ్ల్యూఎస్‌కె చిన్నారావు, వైస్ ప్రెసిడెంట్ జగదీష్ జిల్లా కౌన్సిలర్ చిన్నిబాబు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు.. ఉజ్వల భవిష్యత్తు ముద్దు

ఎస్ఐలు సంతోష్ కుమార్, వెంకటేష్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులతో ఎస్ఐ వెంకటేష్

ప్రజాశక్తి - విఆర్‌పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సాయిరమణ అధ్యక్షతన ఎస్ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛసంకల్పం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిసై తమ విలువైన జీవితాలను కోల్పోతున్నారన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి వారి జీవితాలకు చక్కని బాటలు వేసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వాడినా, రవాణా చేసిన విక్రయించినా చట్టప్రకారం శిక్షార్హులని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ లెనిన్, పోలీస్‌సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంటాక్ట్ లెక్చరర్ శివప్రసాద్, అతిథి అధ్యాపకులు వెంకటేశ్వర్లు , మురళీదొర తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: యువత మాదకద్రవ్యాలను చిన్న వయసు నుండి అలవాటు చేసుకుని బాల్యాన్ని బలి తీసుకుంటున్నారని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ వాటివల్ల తలెత్తే పరిణామాల గురించి విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడి మత్తులో ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

అమాయక గిరిజనులను బలిచేయొద్దు

ప్రజాశక్తి -సీలేరు: అమాయక గిరిజనులను చంపవద్దని మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని జికె వీధి మండలం దుప్పలవాడ పంచాయతీ పరిధి గిరిజనలు పిలుపునిచ్చారు. బుధవారం మావోయిస్టుల చేతులో అమరులైన గిరిజనులు జ్ఞాపకార్థం దుప్పిలివాడలో స్థూపాన్ని ఏర్పాటు చేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్యంలో అశాంతి కల్పించవద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ మావోయిస్టులు అమాయక గిరిజనుల ప్రాణాలు బలిగొన్నారని వారి కుటుంబాలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనుంచి మావోయిస్టు గ్రామాల అభివృద్ధిని అడ్డుకున్న అమాయక గిరిజనులను హతమార్చిన సహించేది లేదని హెచ్చరించారు. కొమ్ములవాడ, బంధవీధి గొర్రెలోవ, రుష్యాగూడా, కొత్త పాకల, చల్లనిశిల్ప గ్రామస్థులు పాల్గొన్నారు.

స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజనులు

సిఐ అశోక్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సిఐ అశోక్‌కుమార్‌కు అభినందన

ప్రజాశక్తి -సీలేరు: ఆర్‌వినగర్ నుంచి లంకపాకల వరకు ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. చింతపల్లి ఎస్పి నవజ్యోతి మిశ్రా, జికెవీధి మండలం సిఐ అశోక్ కుమార్ ఎస్ఐ అప్పలసూరి స్పందించి రహదారి తాత్కాలికంగా బాగుచేయిం చారు. దీనిపై అంతర్రాష్ట్ర రహదారి సాధన కమిటి హర్షం వ్యక్తం చేసింది. సాధన కమిటి సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం సిఐ అశోక్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకుల అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీలేరు సర్పంచ్ పాంగి దుర్జో, మాజీ ఉపసర్పంచ్ కారే శ్రీను జనసేన నాయకులు బత్తుల మార్కురాజు గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

జగన్మోహన్‌రెడ్డిని కలసిన మరియదాస్

ప్రజాశక్తి - విఆర్‌పురం: పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని గతంలో ఇచ్చిన హామీలను పరిష్కరించాలని వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మరియదాసు కోరారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులు పలు సమస్యలతో సతమతమవుతున్నారని సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని గత ప్రభుత్వంలో తెచ్చిన జిఒ ప్రకారం ప్రతి కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్ 10 లక్షలు ఇవ్వాలని గ్రామాన్ని మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని భూనష్టపరిహారం ఇవ్వాలన్నారు.

బురదమయంగా మారిన అమ్మిరేకుల, కిమ్మలగెడ్డ వెళ్లే రహదారి

అధ్వానంగా అమ్మిరేకుల రహదారి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలోని అమ్మిరేకుల కిమ్మలగెడ్డ వెళ్లే ప్రధాన రహదారి బురదమయంగా తయారైంది. దీంతో ప్రయాణికులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజవొమ్మంగి నుండి అమ్మిరేకుల వెళ్లే రహ దారిలో అప్పలరాజుపేట, కిమ్మలిగెడ్డ, కొత్తవీధి, ముర్లవారివీధి గ్రామాలకు చెందిన వందలాది మంది గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారి నడవడానికి సైతం వీలు లేకుండా అధ్వానంగా తయారైందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రహదారికి కొంతమేర బీటి రహదారి పనులు చేపట్టారు. మధ్యలో పనులను అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.